ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం 19 మే 2025 www.prajaswaramdaily.com 3

# చెక్కతో చేసిన ప్యానెళ్ల వల్లే మంటలు : అగ్నిమాపక డీజీ నాగిరెడ్డి



విద్యుదాఘాతం వల్లే గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాదం జరిగిందని అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి తెలిపారు. ఇంటిలో చెక్కతో చేసిన ప్యానెళ్ల వల్లే మంటలు వ్యాపించాయన్నారు. విద్యుదాఘాతంతో చెక్క మొత్తం కాలి మంటలు వచ్చాయని చెప్పారు. "మొదటి అంతస్తులో ఉన్న 17 మందిని ఆసుపత్రికి తరలించాం. నిచ్చెన ద్వారా నలుగురు పైనుంచి కిందికి వచ్చారు. భవనంలో విద్యుత్ సరఫరాకు సంబంధించిన మెయిన్ వద్ద నిత్యం విద్యుదాఘాతం జరుగుతోందని కార్మికులు చెబుతున్నారు. అగ్నిప్రమాద నివారణకు సంబంధించి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోలేదు" అని నాగిరెడ్డి తెలిపారు.

# మీర్ చౌక్‌లో భారీ అగ్నిప్రమాదం

## 17 కు చేరిన మృతుల సంఖ్య - అందులో 8 మంది చిన్నారులు



హైదరాబాద్ : నగరంలోని మీర్‌చౌక్‌లో ఆదివారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఓ నివాస భవనంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది దాదాపు 10 ఫైర్ ఇంజన్లతో ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. అయితే ఇంటి నిర్మాణం తేడాగా ఉండడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. ఊపిరాడక 17 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎనిమిది మంది చిన్నారులు, మహిళలు, పురుషులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సమాచారం తెలిసిన వెంటనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ఫైర్ సిబ్బందికి ఆక్సిజన్ సిలిండర్లు లేకపోవడంతో ప్రాణహానికీ కారణమై ఉండొచ్చని పేర్కొన్నారు. రెస్క్యూలో ఆలస్యం జరగడం తీవ్రతను పెంచిందని తెలిపారు. మృతుల కుటుంబాలకు పూర్తి సహాయం అందించనున్నట్లు హామీ ఇచ్చారు.

మృతుల వివరాలు

అభిషేక్ మోడీ (30), ఆరుషి జైన్ (17), హర్షాలి గుప్తా (7) షీతల్ జైన్ (37), రాజేందర్ కుమార్ (67), సుమిత్ర (65), మున్నిబాయి (72), ఇరాజ్ (2). అగ్నిప్రమాదానికి గల అసలు కారణాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. భవనంలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ప్రమాదానికి దారితీసి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. పూర్తి వివరాలు విచారణ అనంతరం తెలియనున్నాయి.

### ప్రధాని మోదీ దిగ్భ్రాంతి



న్యూఢిల్లీ : హైదరాబాద్ చార్మినార్ పరిధిలోని మీర్ చౌక్‌లో చోటుచేసుకున్న ఘోర అగ్నిప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. ప్రమాదంలో మరణించిన ప్రతి ఒక్కరికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని ప్రధాన్ మంత్రి నరేంద్ర మోడీ ప్రకటించారు.

### సహాయక చర్యలు ముమ్మరం : సీఎం రేవంత్



అగ్నిప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి, సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, వారికి అన్ని విధాలా సహాయం చేయాలని సూచించారు. ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

### పరిస్థితి సమీక్ష

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , ఇతర ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ రెడ్డి ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నారు. సహాయక చర్యలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరపున తక్షణ సహాయం అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు సమీపంలోని ఆసుపత్రులలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం ఈ దుర్ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు

### అత్యంత బాధాకరం: రాహుల్ గాంధీ



చార్మినార్ పరిధిలోని గుల్జార్‌హౌస్‌లో అగ్నిప్రమాద ఘటనపై కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అగ్నిప్రమాదంలో పలువురు మృతి చెందడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.


### సీఎంకు ఖర్గే ఫోన్



సీఎం రేవంత్‌రెడ్డికి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫోన్ చేశారు. గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును సీఎం ఆయనకు వివరించారు. ఎప్పటికప్పుడు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఘటనాస్థలికి మంత్రులు వెళ్లినట్లు చెప్పారు.

### ఆస్పత్రులకు తరలింపు

మంటల్లో చిక్కుకున్న కొందరిని అగ్నిమాపక సిబ్బంది రక్షించి ఉస్మానియా, యశోద (మలక్‌పేట), డీఆర్డీవో అపోలో ఆసుపత్రులకు తరలించారు. విద్యుదాఘాతం వల్లే భవనంలో మంటలు చెలరేగినట్లు అధికారులు తెలిపారు.



## పీఎస్‌ఎల్‌వీ-సి61 ప్రయోగంలో సాంకేతిక సమస్య

### మూడో దశ తర్వాత సమస్య

నెల్లూరు: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ-ఇస్రో చేపట్టిన పీఎస్‌ఎల్వీ - సీ 61 ప్రయోగంలో సాంకేతిక సమస్య తలెత్తింది. ఈ ఉదయం 5 గంటల 59 నిమిషాలకు శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించిన.. పీఎస్ ఎల్‌వీ -సీ 61 వాహక నౌకలో మూడో దశ తర్వాత సమస్య వచ్చింది. ఈ వాహక నౌక భూ పరిశీలనకు చెందిన ఈఓఎస్ -09 ఉపగ్రహాన్ని నింగిలోకి తీసుకెళ్లింది. కాసేపటి తర్వాత పీఎస్ ఎల్‌వీ-సీ 61 ప్రయోగంలో సాంకేతిక సమస్య ఎదురైంది. ఈ నేపథ్యంలో పీఎస్ ఎల్‌వీ-సి 61 ప్రయోగం పూర్తికాలేదని ఇస్రో ఛైర్మన్ నారాయణన్ తెలిపారు. మూడో దశ తర్వాత రాకెట్ లో సమస్య వచ్చిందని విశ్లేషణ తర్వాత వివరాలు చెప్తామని ఇస్రో ఛైర్మన్ వెల్లడించారు.

## హైదరాబాద్‌లో పేలుళ్లకు కుట్ర

### ఐసీస్ మోడల్ ఆపరేషన్ ను భగ్నం చేసిన పోలీసులు

హైదరాబాద్ : నగరంలో పేలుళ్లకు కొందరు వ్యక్తులు ప్లాన్ చేశారు. అయితే ఆంధ్ర, తెలంగాణ పోలీసులు జాయింట్ ఆపరేషన్ నిర్వహించి ఈ వ్యక్తులను పట్టుకున్నారు. ఐసీస్ మోడల్ ఆపరేషన్ ని భగ్నం చేశారు. విజయనగరంకు చెందిన సిరాజ్, హైదరాబాద్ కు చెందిన సమీర్ ను అరెస్టు చేశారు. విజయనగరం లో పేలుడు పదార్థాలు కొనుగోలు చేశాడు సిరాజ్. సమీర్ తో కలిసి అతను నగరంలో డమ్మీ బ్లాస్ట్ కు ప్లాన్ చేశారు. వీరికి ఐసిస్ మాడ్యూల్ అదేశాలు ఇచ్చింది. తెలంగాణ కౌంటర్ ఇంటలిజెన్స్ తో పాటు ఆంధ్ర ఇంటెలిజెన్స్ ఆపరేషన్ నిర్వహించి వారి కుట్రను భగ్నం చేశాయి.

**విజయనగరంకు చెందిన సిరాజ్, హైదరాబాద్ కు చెందిన సమీర్ అరెస్టు**

**తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్‌తో పాటు ఆంధ్ర ఇంటెలిజెన్స్ ఆపరేషన్**

